
సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం : 28 : జనవరి : 2025



వ్యాధులకు చెక్ పెట్టండిలా !
ఆక్వా సాగులో వ్యాధుల నిర్వహణ తప్పనిసరి. జాగ్రత్తలు తీసుకోకుంటే నష్టాలు తప్పవని, ముందస్తు నివారణ మేలని నిపుణులు చెబుతున్నారు. 8లో ▸



ఇద్దరు మృతి
దెందులూరు మండలంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉండి మండలానికి చెందిన ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. 8లో ▸



దొంగ స్వామీజీ అరెస్టు
అశుభం జరుగుతుందంటూ భయపెట్టి పూజలు చేయిస్తానంటూ డబ్బులు తీసుకొని ఉడాయించే దొంగ స్వామీజీని పోలీసులు అరెస్ట్ చేశారు. 8లో ▸

ఎరువుల కొరత.. రైతు కలత

- 10:26:26 కాంప్లెక్స్ ఎరువు స్టాకు లేదంటున్న సొసైటీలు
- రూ.100 వరకు పెంచి అమ్ముతున్న డీలర్లు
- ఇప్పటికే ధరల పెరుగుదలతో రైతులు సతమతం
- ప్రత్యామ్నాయ ఎరువులు ఉన్నాయంటున్న వ్యవసాయ శాఖ


ఎరువులు

సాక్షి, భీమవరం: దాళ్వాలో ఎక్కువగా వినియోగించే కాంప్లెక్స్ ఎరువుకు కృత్రిమ కొరత ఏర్పడింది. అధిక శాతం సొసైటీల్లో స్టాకు లేక బయటి మార్కెట్‌లో బస్తాకు రూ.100ల వరకు అదనంగా వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఫెర్టిలైజర్స్ కంపెనీలు ఇటీవల ఎరువుల ధరలను పెంచగా, వ్యాపారుల అదనపు వసూళ్లతో రైతులపై మరింత భారం పడుతోంది.

2.22 లక్షల ఎకరాల్లో.. జిల్లాలోని 2.22 లక్షల ఎకరాల్లో రైతులు రబీ సాగు చేస్తున్నారు. 70 శాతం విస్తీర్ణంలో నాట్లు పూర్తి కాగా ముందుగా నాట్లు వేసిన తాడేపల్లిగూడెం ఏరియాలో పంట పిలకలు చేసే దశలో ఉంది. ఖరీఫ్‌తో పోలిస్తే రబీలో రైతులు ఎరువులు ఎక్కువగా వినియోగిస్తారు. రెండు బస్తాల వరకు యూరియా, పొటాష్‌తో పాటు మూడు నుంచి నాలుగు బస్తాల వరకు కాంప్లెక్స్ ఎరువులు వినియోగిస్తుంటారు. సీజన్ మొత్తానికి అన్నిరకాల ఎరువులు కలిపి 1,00,949 టన్నులు అవసరమవుతాయని వ్యవసాయశాఖ అంచనా. హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సొసైటీలు ఎరువుల అమ్మకాలు చేస్తుంటాయి.

10:26:26కు కొరత
పంట బాగా మూనలు తిరిగి దుబ్బు చేస్తాయన్న భావనలో నాట్లు వేసిన తర్వాత దాదాపు నెల రోజుల వ్యవధిలో యూరియాతో పాటు పైపాటుగా కాంప్లెక్స్ ఎరువులు వేస్తుంటారు. కొందరు మూడో దఫా, మరికొందరు నాల్గో దఫాగా 10:26:26 ఎరువును వినియోగిస్తారు. ఈ ఎరువు వంద కేజీల్లో 10 కేజీలు నైట్రోజన్, 26 కేజీలు పాస్ఫరస్, 26 పొటాష్ ఉంటుంది. మూనలు సమానంగా ఎదిగేందుకు ఈ ఎరువు బాగా ఉపయోగపడుతుందని రైతుల నమ్మకం. ఈ సీజన్‌లో కాంప్లెక్స్ ఎరువుల ధరలను కంపెనీలు పెంచేశాయి. వీటిలో 10:26:26 బస్తా రూ.1,470లు నుంచి రూ.1,700లకు, 14:35:14 ఎరువు రూ.1,700 నుంచి రూ.1,800లకు, 20:20:013 ఎరువు రూ.1,250 నుంచి రూ.1,300లకు పెరిగాయి. దీంతో ఎకరాకు రూ.500ల వరకు పెట్టుబడులు పెరుగుతున్నాయని రైతులు అంటున్నారు.

అదనపు భారం : జిల్లాలో ఎరువులు విక్రయించే సొసైటీలు 115 వరకు ఉండగా, హోల్‌సేల్ డీలర్లు 18 మంది, రిటైల్ వ్యాపారులు 476 మంది ఉన్నారు. చాలా సొసైటీల్లో 10:26:26 స్టాకు లేని పరిస్థితి. ముందుగా నాట్లు వేసిన తాడేపల్లిగూడెం, పరిసర ప్రాంతాల్లో ప్రస్తుతం ఈ ఎరువుకు డిమాండ్ ఎక్కువగా ఉంది. సొసైటీల్లో లభ్యత లేకపోవడంతో వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి బస్తాకు రూ.50లు నుంచి రూ.100లు అధిక ధరలకు అమ్మకాలు చేస్తున్నట్టుగా రైతులు చెబుతున్నారు. యూరియా బస్తా ధర రూ.266 ఉండగా కొన్నిచోట్ల రూ.320 వరకు విక్రయిస్తున్నారంటున్నారు. జిల్లాలో ఇంకా నాట్లు జరుగుతుండటంతో అవసరమైన సమయానికి ఎరువు దొరుకుతుంతో లేదోనన్న ఉద్దేశంతో ముందుగానే స్టాకు తెచ్చి పెట్టుకోవడం కొరతకు కారణమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

దాళ్వాలో ఎరువుల అవసరం (టన్నుల్లో..)

యూరియా	41,823
డీఏపీ	5,562
ఎంఓపీ	5,031
కాంప్లెక్స్ ఎరువులు	41,409
ఎస్ఎస్‌పీ	7,124

స్టాకు లేదంటున్నారు



సొంతం, కౌలు కలిపి 10 ఎకరాలు వరకు సాగు చేస్తున్నాను. 10:26:26 ఎరువు కోసం వెళితే స్టాకు లేదని సొసైటీలో చెబుతున్నారు. బయట మార్కెట్‌లో వ్యాపారులు బస్తాకు రూ.50 నుంచి రూ.100 వరకు పెంచి అమ్ముతున్నారు. దాళ్వా నుంచి ఎరువుల ధరలు పెరిగిపోగా బ్లాక్ మార్కెట్‌తో రైతులపై మరింత భారం పడుతోంది.
– ములగాల గంగారావు, రైతు, తాడేపల్లిగూడెం

10:26:26 ఎరువు అవసరం లేదు



జిల్లాలో ఎరువులకు కొరత లేదు. 10:26:26 ఉత్పత్తిని కంపెనీలు తగ్గించాయి. రైతుల్లో అపోహ తప్పితే ఈ ఎరువు అవసరం లేదు. ప్రత్యామ్నాయంగా 14:35:14, 16:16:16, 20:20, 28:28 తదితర చాలా రకాల కాంప్లెక్స్ ఎరువులు ఉన్నాయి. నాట్లు వేసిన పదిరోజుల్లోగా ఎకరాకు రెండు బస్తాల వరకు కాంప్లెక్స్ ఎరువులు వేస్తే సరిపోతుంది. అంతకు మించి వేయడం వలన రైతుకు ఖర్చు పెరగడం తప్పితే పంటకు ఉపయోగం లేదు. తాడేపల్లిగూడెం ప్రాంతంలో పంట పిలకల దశలో ఉన్నందున కాంప్లెక్స్ ఎరువులు అవసరం లేదు.
– జెడ్.వెంకటేశ్వరరావు, వ్యవసాయశాఖ జేడీ

అర్జీల పరిష్కారానికి కృషి


అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజాసమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)లో అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని, ఈ దిశగా అధికారులు కృషిచేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌లో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. అర్జీల పరిష్కారం నాణ్యతగా, రీ ఓపెన్ కాకుండా ఉండాలని స్పష్టం చేశారు. అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, గ్రామ, వార్డు సచివాలయం అధికారి వై.దోసిరెడ్డి, డిప్యూటీ కలెక్టర్ బి.శివన్నారాయణ రెడ్డి, డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు, వయోవృద్ధుల సంక్షేమం ట్రిబ్యునల్ మెంబరు మేళం దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..
- మొగల్తూరు మండలం వారతిప్పలో మంచినీటి చెరువులోని చేపలకు వేలం నిర్వహించకుండా పంచాయతీ కార్యదర్శి, ఈఓపీఆర్డీ గ్రామంలో కొందరితో కుమ్మక్కై పట్టుబడి చేసుకునే అమ్ముకున్నారని ఎంపీటీసీ భర్త తిరుమాని శివ నాగరాజు ఫిర్యాదు చేశారు.
- పాలకొల్లుకి చెందిన మంగ రత్నమాల ఆచంటలో సర్వే నంబర్ 7897లో తన భూమి ఆక్రమణకు గురైందని, సర్వే చేసి వాస్తవ భూమి చూపించాలని అర్జీ అందజేశారు.
- పెంటపాడు మండలం ముదునూరుపాడులో నివాసాల మధ్య బ్రాందీ షాపులను నిర్వహిస్తున్నారని, దీంతో ఇబ్బంది పడుతున్నామని మహిళలు బి.సత్యవతి, కె.మంగ టి.సరస్వతి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

న్యూస్‌రీల్

విభిన్న ఆలోచనలతో కొలువులు


మాట్లాడుతున్న నిట్ రిజిస్ట్రార్ శంకరరెడ్డి

తాడేపల్లిగూడెం: విభిన్న ఆలోచనలు ప్రతి విద్యార్థి జీవితంలో భాగం కావాలని ఏపీ నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి పిలుపునిచ్చారు. ఏపీ నిట్‌లో సోమవారం ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ సెంటర్ ఆధ్వర్యంలో బీటెక్ విద్యార్థులకు హ్యాకథాన్ కార్యక్రమం నిర్వహించారు. దినేష్ రెడ్డి మాట్లాడుతూ సాంకేతిక నైపుణ్యాలు ఉంటేనే కొలువుల సాధన సాధ్యమన్నారు. విభిన్న ఆలోచనలకు అక్షర రూపమిస్తే అద్భుత ఆవిష్కరణలు రూపుదిద్దుకుంటాయన్నారు. ఆచార్యులు కృష్ణ చైతన్య మాట్లాడుతూ మూడు సమస్యలపై 24 గంటల్లో కొత్త సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేసి తీసుకురావాలని కోరారు. ప్రోగ్రాం కో–ఆర్డినేటర్, అసోసియేట్ డీన్ ఫణి శ్రీకృష్ణ అధ్యక్షత వహించారు.

30న విశాఖ ఉక్కు పరిరక్షణ యాత్ర రాక

భీమవరం: సీపీఎం చేపట్టిన విశాఖ ఉక్కు పరిరక్షణ యాత్ర ఈనెల 30న భీమవరం చేరుకుంటుందని, యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్ సోమవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. సీపీఎం రాష్ట్ర మహాసభలు జరుగుతున్న తరుణంలో యాత్ర విశాఖ నుంచి నెల్లూరు వరకు సాగుందని పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్‌కు ప్యాకేజీ ప్రకటించినంత మాత్రాన సమస్య శాశ్వతంగా పరిష్కారం కాలేదని తెలిపారు. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ విశాఖ స్టీల్ అప్పుల్లో ఉందని సెయిల్‌లో విలీనం సాధ్యం కాదని చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు.

నిరుద్యోగ భృతి అమలుచేయాలి


పాదయాత్ర ప్రారంభిస్తున్న దుర్గాప్రసాద్

ఏలూరు (టూటౌన్): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు భృతి ఇస్తామని ఇచ్చిన హామీని అమలుచేయాలని ఏపీ ప్రైవేట్ టీచర్స్ అండ్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి చిక్కాల దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరుతూ ఏలూరు నుంచి కాకినాడకు 15 రోజుల పాటు నిర్వహించే పాదయాత్రను సోమవారం ఏలూరులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులను ఆదుకునేందుకు తక్షణం మెగా డీఎస్సీ తీయాలన్నారు. వలంటీర్ల వ్యవస్థను పునరుద్ధరించి వారికి నెలకు రూ.10 వేల వేతనం అందించాలని కోరారు. సచివాలయ సిబ్బందిని పర్మినెంట్ చేసి వారికి పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలన్నారు. ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్లకు ప్రత్యేక చట్టం చేసి దాని ద్వారా హెల్త్‌స్కీమ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు.

లేగదూడల అందాల పోటీలు

పోడూరు: మట్టపర్రులో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం లేగదూడల అందాల పోటీలు నిర్వహించారు. మొత్తం 35 లేగదూడలు పాల్గొన్నాయి. కడలి సత్యనారాయణకు చెందిన లేగదూడ ప్రథమ, బండారు నాగేశ్వరరావుకు చెందిన దూడ ద్వితీయ, అడ్డాల ప్రసాద్‌కు చెందిన దూడ తృతీయ బహుమతులు సాధించాయి. సర్పంచ్ దొమ్మేటి శ్రీనివాస్, పాలకొల్లు వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ పెన్మెత్స రామభద్రరాజు, పశుసంవర్ధకశాఖ ఏడీ పి.జయకర్ బహుమతులు అందించారు. అలాగే పశువైద్య శిబిరం నిర్వహించి సుమారు 50 పశువులకు వ్యాధినిరోధక టీకాలు వేశారు. మండల పశువైద్యాధికారి ఎస్.మహేష్‌కుమార్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో వర్మీ కంపోస్టు స్టాల్

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం వర్మీ కంపోస్టు అమ్మకానికి ఉంచుతామని కలెక్టర్ నాగరాణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ వద్ద వర్మీ కంపోస్టు స్టాల్‌ను ఆమె ప్రారంభించారు. వ్యవసాయంలో ఆర్గానిక్ వర్మీ కంపోస్టు వాడకంతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. కిలో ఒక్కింటికి రూ.10ల చొప్పున స్టాల్‌లో విక్రయిస్తారని, ప్రతి సోమవారం రొటేషన్ పద్ధతిలో రెండేసి పంచాయతీల చొప్పున అమ్మకాలు చేస్తారని, తొలిరోజు విస్సాకోడేరు, ఉణుదుర్రు పంచాయతీల ఎస్‌డబ్ల్యూసీ ప్లాంట్ల నుంచి తయారు చేసిన వర్మీ కంపోస్టును అందుబాటులో ఉంచామన్నారు. డీపీఓ బి.అరుణశ్రీ, టెక్నికల్ కో–ఆర్డినేటర్ ఎస్.ఎడ్వర్డ్ పాల్గొన్నారు.

పశువధ శాలపై అధికారుల తీరు అనుమానాస్పదం

ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రవీంద్రనాథ్

తణుకు అర్బన్: తణుకు మండలం తేతలిలో పశువధ శాలపై అధికారుల తీరు అనుమా నాస్పదంగా ఉందని ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్ మండిపడ్డారు. సోమవారం జరిగిన తణుకు మండల పరిషత్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ లాహం ఫుడ్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహిస్తున్న పశువధ శాలపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నా ప్రజలపక్షాన నిలవాల్సిన అధికారులు తప్పుడు సంకేతాలు ఇచ్చేలా ప్రవర్తిస్తున్నారని దుయ్యబట్టారు. ఫ్యాక్టరీ అనుమతుల్లో లోపాలున్నాయని ప్రజలు చెబుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం అనుమానాస్పదంగా ఉందన్నారు.

పోలీస్ పికెటింగ్ ఎందుకు?
తేతలి ప్రజలు, గోసేవా సమితి ఆధ్వర్యంలో శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే పోలీస్ పికెటింగ్ ఎందుకు పెట్టాల్సి వచ్చిందని, పోలీసుల కాపలాతో ఫ్యాక్టరీ నడిపించడమేంటని, ప్రజలేమైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగించారా అని నిలదీశారు.

ఆటోడ్రైవర్‌పై జరిమానా సరికాదు
రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైన ఆటో డ్రైవర్‌కు జరిమానా వ్యవహారం బాధాకరమని ఎమ్మెల్సీ అన్నారు. జిల్లా మారిందంటూ రూ.3,400 జరిమానా విధిస్తారా అని రవాణా శాఖ అధికారిని నిలదీశారు. ఒత్తిళ్లకు లొంగి తప్పులు చేయవద్దని హితవుపలికారు. తణుకు జాతీయ రహదారికి ఇరువైపులా కూడా తూర్పుగోదావరి జిల్లా పరిధి ఉందన్నారు. రవాణా విభాగంలో ఇబ్బందులను మండలి సమావేశంలో చర్చిస్తామన్నారు. ఎంపీపీ రుద్రా ధనరాజు, జెడ్పీటీసీ ముళ్లపూడి అన్నపూర్ణాదేవి, ఎంపీడీఓ ఆర్.లోహిత్ జయసాగర్ పాల్గొన్నారు.

కొల్లేరుపై కామినేని గారడీ

- ఎన్నికల్లో శాశ్వత పరిష్కారమంటూ కొత్త అజెండా
- సమస్య తీవ్రం కావడంతో ఇటీవల హడావుడిగా సమావేశం
- కాంటూరు కుదింపును అటకెక్కించిన నేతలు
- కూటమి నేతల మాయమాటలతో కొల్లేరు విలవిల
- కొల్లేరు ప్రజల్లో రగులుతున్న అసంతృప్తి


కొల్లేరు సరస్సు, (అంతరచిత్రం) మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు: కూటమి ప్రజాప్రతినిధులకు కొల్లేరు కష్టాలు ముంచుకొచ్చాయి. కృష్ణా నది వరదలతో కొల్లేరు కకావికలం కావడంతో మళ్లీ రాష్ట్రస్థాయిలో కొల్లేరు ఆక్రమణలపై తీవ్రస్థాయిలో చర్చ జరిగింది. ఈ పరిణామాల క్రమంలో సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో తీవ్ర గందరగోళం రేగి ప్రజల్లో అసంతృప్తి రగులుతోంది. ప్రతి ఎన్నికలకు కొల్లేరును సెంటిమెంట్‌గా వాడుకుని లబ్ధి పొందిన కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌తో సహా ప్రజాప్రతినిధులకు ఈసారి గట్టి షాక్ ఇవ్వడంతో మళ్లీ యథావిధిగా మాయమాటలతో ముచ్చట్లకు తెరతీయడం చర్చనీయాంశంగా మారింది.

మళ్లీ బడాయి మాటలు
కొల్లేరు సమస్యలను పరిష్కరిస్తానంటూ 2014 నుంచి ఎన్నికల సమయంలో హామీలిచ్చి కొల్లేరు ఓట్లతో గట్టెక్కిన బీజేపీ ఎమ్మెల్యే కామినేని మళ్లీ బడాయి మాటలకు తెరతీశారు. మూడు నెలల్లో కొల్లేరు అభయారణ్యంలో అక్రమ చెరువులు ధ్వంసం చేసి సరిహద్దులు నిర్ణయించాలని సుప్రీం ఆదేశాలతో కొల్లేరు పరీవాహక గ్రామాల్లో కలకలం రేగింది. కొల్లేరు ఓటర్లకు కూటమి ప్రజాప్రతినిధులు విలన్లుగా మారిపోయారు. దీంతో మళ్లీ హడావుడిగా కొల్లేరుకు శాశ్వత పరిష్కారమంటూ బడాయి మాటలు చెప్పడానికి ప్రత్యేకంగా వేదిక ఏర్పాటు చేయించి మరీ పాత పాటే పాడటం చర్చనీయాంశంగా మారింది. గత శనివారం కైకలూరులో కొల్లేరు పెద్దల సమావేశమంటూ టీడీపీ ముఖ్యనేతలతో సమావేశం ఏర్పాటు చేయించి అత్యంత జాగ్రత్తగా కాంటూరు లెవిల్ 5 నుంచి 3కు కుదింపు అంశాన్ని అటకెక్కించడంలో ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్ విజయవంతమయ్యారు. ఇప్పుడు తాజాగా మీరెంత వరకైనా పోరాడండి మీ వెనుక కొల్లేరు ఎమ్మెల్యేలు కామినేని, చింతమనేని, రఘురామకృష్ణరాజు, ధర్మరాజు, ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్ ఉంటారని ప్రకటించి సమస్య పరిష్కార భారం కొల్లేరు ప్రజలపైనే వదిలేశారు.

2014 నుంచీ అదేమాట
కామినేని 2014లో బీజేపీ అభ్యర్థిగా కైకలూరు నుంచి గెలిచి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రిగా పని చేశారు. ఆ సమయంలో ప్రచారానికి వచ్చిన ప్రధాని మోదీ భీమవరం సభలో కొల్లేరు కాంటూరు కుదింపు, పెద్దింట్లమ్మ వారధి నిర్మాణాలకు హామీ ఇచ్చారు. 2015 జూలైలో అప్పటి కేంద్ర పర్యావరణ మంత్రి ప్రకాశ్ జవదేవకర్, మరో మంత్రి వెంకయ్యనాయుడుతో కలసి కొల్లేటికోటలో సమావేశం ఏర్పాటుచేశారు. కాంటూరు కుదింపు అంశంపై త్రిసభ్య కమిటీ బృందం ఏర్పాటుచేశారు. ఈ కమిటీ పర్యావరణానికే ప్రాధాన్యమిచ్చినా కొల్లేరుపై ఏమీ తేల్చలేదు. మళ్లీ 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం ఏర్పడగానే బీజేపీ అభ్యర్థిగా వచ్చి శాశ్వత పరిష్కారం చూపిస్తానని, కాంటూరు కుదింపు చేస్తానని కామినేని పాతపాటే పాడారు. కామినేని హామీ ఇచ్చిన పెద్దింట్లమ్మ వారధి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో నిర్మించడం విశేషం.

సుప్రీం ఆధీనంలో.. కొల్లేరు సమస్య రాష్ట్ర పరిధిలో లేదు, సుప్రీంకోర్టు ఆధీనంలో ఉంది. 1999 అక్టోబరు 4న అప్పటి చంద్రబాబు ప్రభుత్వం జీఓ 120 ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి, పూర్వ కృష్ణా జిల్లాలో 9 మండలాల్లో +5 కాంటూరు పరిధి వరకు 77,138 ఎకరాల్లో కొల్లేరును అభయారణ్యంగా గుర్తించారు. ఆక్రమణలు పెరగడంతో 2006లో సుప్రీంకోర్టు ఆదేశాలతో కొల్లేరు ఆపరేషన్ చేశారు. కాకినాడకు చెందిన కె.మృత్యుంజయరావు గతేడాది సెప్టెంబర్ 1న అప్పటి సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను ప్రతివాదిగా చేరుస్తూ కొల్లేరు ఆక్రమణలపై పిటిషన్ దాఖలు చేశారు. ఈనెల 16న కొల్లేరు ఆక్రమణలపై సుప్రీం కొరడా ఝులిపించింది. మూడు వారాల్లో ప్రభుత్వం నివేదిక అందించాలని ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 14నకు వాయిదా వేసింది.


కొల్లేరు ప్రజలు ఏం కోరుతున్నారంటే..

కొల్లేరు కాంటూరు 5 నుంచి 3కు కుదించడం, గతంలో కొల్లేరు ఆపరేషన్ జరిగిన సమయంలో 7,500 ఎకరాల భూమిని అదనంగా ధ్వంసం చేశారు. వాటిని పేదలకు పంచాలని బలమైన డిమాండ్ ఉంది. దివంగత వైఎస్సార్ హయాంలో భూ పంపిణీకి ప్రయత్నించినా సాధ్యం కాలేదు. అలాగే 14,932 జిరాయితీ భూములు, 5,510 ఎకరాల బీఫాం పట్టా భూములు పంపిణీ చేయాలి. ఇక సుప్రీంకోర్టులో కేసు కొనసాగుతున్న క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్, రివ్యూ పిటిషన్లు దాఖలు చేసి కొల్లేరు వాదనలు వినిపించాలి. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కొల్లేరుపై సమీక్ష నిర్వహించి కాంటూరు కుదింపుపై తీర్మానం చేసి కేంద్రాన్ని ఒప్పించాలి. కొల్లేరు పరీవాహక ప్రాంతంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలు ఉన్నారు. వాస్తవానికి కొల్లేరు సమస్యలు జాతీయ వన్యప్రాణి సంరక్షణ బోర్డు (ఎన్‌టీడబ్ల్యూఎల్) ఆమోదంతో జరగాలి. రాష్ట్ర బోర్డు తీర్మానం చేస్తేనే ఇదంతా జరుగుతుంది. ఇవేమి మాట్లాడకుండా మీరు పోరాడండి వెనుక మేం ఉంటామంటూ హడావుడి సమావేశాలు నిర్వహించడంపై లంకవాసులు అసంతృప్తితో రగిలిపోతున్నారు.

మహిళలపై పశువధ శాల సిబ్బంది దాడి

- పశువుల వ్యాన్‌లను అడ్డుకున్నారని దారుణం
- కిరాయి మనుషులతో ఫ్యాక్టరీ యాజమాన్యం కిరాతకం
- తేతలిలో ఉద్రిక్తత




తేతలి పశువధ కర్మాగారం వద్ద ఉన్న తేతలి గ్రామస్తులు, గోసేవా సమితి సభ్యులు, కర్మాగారం వద్ద గేదెలు ఉన్న వ్యాన్

తణుకు అర్బన్: తణుకు మండలం తేతలి గ్రామంలోని లాహం ఫుడ్స్ ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్వహిస్తున్న పశువధ శాల ప్రాంతం సోమవారం రాత్రి ఉద్రిక్తతగా మారింది. ఫ్యాక్టరీకి గేదెలతో వచ్చిన ఐదు వ్యాన్‌లను స్థానికులు అడ్డుకున్న సమయంలో ఫ్యాక్టరీ సిబ్బంది, గేదెల వ్యాన్‌లతో వచ్చిన వారు దాడికి పాల్పడ్డారు. మహిళలు అని కూడా చూడకుండా దారుణంగా దాడి చేసి మరీ కొట్టారని స్థానికులు వాపోతున్నారు. ఫ్యాక్టరీ వద్దకు రాత్రి సమయంలో వ్యాన్‌లను అధిక సంఖ్యలో తరలిస్తుండటంగా గ్రామానికి చెందిన ఆరుగురు మహిళలు, నలుగురు పురుషులు అడ్డుకున్నారు. దీంతో ఫ్యాక్టరీ యాజమాన్యం 30 మంది కిరాయి మనుషులను పెట్టుకుని దాడులకు దిగిందని మహిళలు ఆవేదన చెందుతున్నారు. రెండు వ్యాన్‌లు తప్పించుకుని ఫ్యాక్టరీ లోపలకు వెళ్లగా, ఏడు గేదెలు ఉన్న మూడు వ్యాన్‌లను గ్రామస్తులు అడ్డుకుని పోలీసుల సాయంతో గోశాలకు తరలించారు. ఇక్కడకు చేరిన పోలీసుల సమక్షంలోనే ఫ్యాక్టరీ తరపున కిరాయికి వచ్చిన వారు మహిళలను బెదిరిస్తూ ఇక నుంచి వ్యాన్‌లను అడ్డుకుంటే ఊరుకోబోమని, ఇష్టానుసారం కొడతామంటూ హెచ్చరించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఫ్యాక్టరీ సిబ్బంది దాడి చేశారని తెలిసి గ్రామస్తులు పెద్దసంఖ్యలో ఇక్కడకు చేరారు. ఎస్సై చంద్రశేఖర్ సైతం ఫ్యాక్టరీ యాజమాన్యానికి మద్దతుగా మాట్లాడారని వ్యాన్‌లను అడ్డుకోవడానికి మీరెవరని, మీపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారని బాధితులు ఆందోళన చెందుతున్నారు. తమకు రక్షణ ఇవ్వాల్సిన పోలీసులు కూడా ఫ్యాక్టరీ యాజమాన్యానికి మద్దతుగా నిలుస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఘటనా ప్రాంతంలో తీవ్ర దుర్వాసన వస్తుండటంతో బాధితులు ముక్కులు మూసుకుని ఉండాల్సి వచ్చింది. దాడి ఘటనపై బాధితులు తణుకు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్‌కు అవార్డు



కలెక్టర్ నాగరాణి నుంచి అవార్డు అందుకున్న ఆంధ్రా సుగర్స్ ప్రతినిధులు

తణుకు అర్బన్ : గణతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా తణుకు ది ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్‌కు కలెక్టరు చదలవాడ నాగరాణి అవార్డు అందచేశారు. సంస్థ నిర్వహించిన సామాజిక సేవా విభాగంలో భాగంగా ఆదివారం భీమవరంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో ప్రత్యేక అవార్డును అందుకున్నట్లు సంస్థ ప్రతినిధులు పీవీఎస్ విశ్వనాథ్ కుమార్, బలుసు కామేశ్వరరావు తెలిపారు.

విద్యార్థి మృతదేహం లభ్యం



చెరువులో నుంచి మృతదేహాన్ని బయటకు తెస్తున్న దృశ్యం

దెందులూరు : సీతంపేట గ్రామంలో చెరువులో పడి అదృశ్యమైన విద్యార్థి గుజ్జుల గణేష్ (10) ఆచూకీ కోసం రెండో రోజు గాలింపు చర్యలు చేపట్టారు. కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలతో విజయవాడ నుంచి ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందిని పిలిపించారు. దెందులూరు తహసీల్దార్ బి.సుమతి, ఎస్సై ఆర్.శివాజీ పర్యవేక్షణలో ఎన్‌డీఆర్ఎఫ్ బృందం బోట్లతో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం 6:30కు గణేష్ మృతదేహాన్ని ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది చెరువు నుంచి బయటకు తీసుకొచ్చారు.

1 నుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు



సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు సీపీఎం 25వ రాష్ట్ర మహాసభలు నెల్లూరులో పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారని పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి చెప్పారు. సోమవారం ఏలూరు పవర్‌పేటలోని ఉద్దరాజు రామం భవనంలో సీపీఎం రాష్ట్ర మహాసభల పోస్టర్లను పార్టీ జిల్లా నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఫిబ్రవరి 3న భారీ బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రచార జాతాలు జరుగుతున్నాయని, పోలవరం నిర్వాసితుల సమస్యలపై జరుగుతున్న ప్రచార జాత జిల్లాలో ఈనెల 30న పర్యటిస్తుందని చెప్పారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.ఎన్.వి.డి.ప్రసాద్, ఆర్.లింగరాజు పాల్గొన్నారు.

ఆక్వాలో వ్యాధులకు చెక్ పెట్టండిలా !

ముందస్తు నివారణ మేలంటున్న నిపుణులు



కైకలూరు: జీవ వైవిధ్యాన్ని కాపాడటంతో పాటు మారుతున్నా వాతావరణ పరిస్థితులను తట్టుకునేందుకు ఆక్వా సాగులో వ్యాధుల నిర్వాహణ తప్పనిసరి. పర్యావరణ ఒత్తిళ్లు, సరైన యాజమాన్య నిర్వహణ లేకపోవడంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో 1.25 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. దాదాపు 72 వేల మంది రైతులు ఈ రంగంపై ఆధారపడ్డారు. ఈ ప్రాంతాల నుంచి ఏటా 4.50 టన్నుల ఉత్పత్తి జరుగుతోంది. దాదాపు రూ.20 వేల కోట్ల టర్నోవర్ సాధిస్తురు. అయితే యజమాన్య పద్ధతుల్లో వెనకంజలో ఉన్నారు. చేపల, రొయ్యల సాగులో జాగ్రత్తలను కాకినాడకు చెందిన విశ్రాంత మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ డా.పి.రామ్మోహన్ రావు వివరించారు.

వ్యాధుల వ్యాప్తిని గుర్తించండి



చేపలో మొప్ప వ్యాధి

వ్యాధి వ్యాప్తిని గుర్తించడానికి చెరువుల్లో రొయ్యలు, చేపలు బలహీనంగా ఈదడం, ఆక్సిజన్ లేమి, చెరువు నీటిపై జీవాలు గుమికూడడం, ఆకలి కోల్పోవడం, చేపలపై గాయాలు, పుండ్లు, రక్తస్రావం, చీలిపోయిన రంగుమారిన రెక్కలు, చేప చర్మం, మొప్పలపై అధిక జిగురు, రొయ్యలలో యాంటినా తెగిపోవడం, కాళ్ళు కొరికినట్లుండడం(నెక్రోసిస్), శరీర రంగు, మొప్పలు పాలిపోవడం, తెల్లటి, ఎర్రటి మచ్చలు, చేపల పొట్ట ఉబ్బడం, పీక్కుపోయిన కళ్ళు వంటి లక్షణాలు గుర్తించారు. అలాగే బాహ్యపరాన్న జీవుల పెరుగుదల, ప్రొటోజోవా పరాన్నజీవులు పేరుకుపోవడం, రొయ్యల్లో ఉదరభాగం వంపు తిరిగి వెదురు బొంగు ఆకారంలో మారడం వంటి లక్షణాలు గమనించవచ్చు.

తీసుకోవాల్సిన చర్యలు



- వ్యాధి వ్యాప్తి చెందకుండా అనారోగ్యంతో ఉన్న చేపలు, రొయ్యలను వేరుగా ఉంచాలి.
- నీటి నాణ్యత పరీక్షించాలి.
- రోగ నిర్ధారణ పరీక్షల కోసం ఆక్వా టెక్నీషియన్‌ను సంప్రదించాలి.
- మెరుగైన ఏరేషన్, నీటిప్రవాహం వంటి చర్యలు చేపట్టాలి.
- మేతను సరైన విధంగా సర్దుబాటు చేసి ఒత్తిడి తగ్గించాలి.
- నిపుణుల మార్గదర్శకత్వంలో సిఫార్సు చేసిన చికిత్సలు అందిచాలి.

వ్యాధులను నివారించే చర్యలు

- నీటి గుణాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ.. ఉండాల్సిన స్థాయిలో నిర్వహించాలి.
- సరైన జీవ భద్రత చర్యలు చేపట్టాలి.
- చెరువులోకి చేపల, రొయ్యల పిల్లలను క్వారంటైన్ చేసి వదలాలి.
- మంచి ప్రోబయోటిక్స్ వినియోగించి చెడు బ్యాక్టీరియా నివారించాలి.

అధిక సాంద్రతతో అనర్థదాయకం



అధిక సాంద్రత వ్యాధి వ్యాప్తిని పెంచుతుంది. చెరువులో అమ్మోనియా, నైట్రేట్, హైడ్రోజన్ సల్ఫైడ్ స్థాయిలు పెరగడాన్ని గమనించాలి. వైరస్, ఈహెచ్‌పీ వంటి వ్యాధికారక జీవుల కచ్చితమైన గుర్తింపుకోసం పీసీఆర్ పరీక్షలు చేయించాలి. పర్యవేక్షణ, బయో సెక్యూరిటీ, నీటినాణ్యత నిర్వహణ, సరైన పోషకాహారం అమలు చేయడం చాలా ముఖ్యం.

– డా.పి.రామమోహన్‌రావు, విశ్రాంత మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్

- చెరువు దగ్గర పనిచేసే సిబ్బందికి తగిన శిక్షణా నైపుణ్యం కల్పించాలి.
- చెరువుకు సంబంధించిన రికార్డులు నిర్వహించడం.
- నిషేధిత యాంటీబయోటిక్స్ వాడకూడదు.
- నిపుణుల సలహా మేరకు శానిటైజర్స్ వాడాలి.
- అనారోగ్యంగా, మందకొడిగా ఉన్న జీవులను ఏరివేయాలి.
- నీటిని వడగట్టడం, నీటిమార్పిడి నిర్వహించాలి.
- పోషకాహారంతో కూడిన సమతుల్యమైన మేతను వాడాలి.

తప్పక పాటించండి

- చెరువులోని చేపలు, రొయ్యలను ట్రయల్ నెట్టింగ్ వేసి ఆరోగ్యం పరిశీలించాలి.
- చెరువులో వాడే పనిముట్లని, వలలను, ఇతర సామాగ్రిని ఎప్పటికప్పుడు శుద్ధి చేసుకుంటూ ఉండాలి.
- చెరువు దగ్గర పనిచేసేవారికి జీవభద్రత, వ్యాధులపై అవగాహన కల్పించాలి.

ప్రాణం తీసిన గూటీ బిళ్ల



మాతకాని హరికృష్ణ (ఫైల్)

పాలకొల్లు అర్బన్: గూటీ బిళ్ల ఆట యువకుడి ప్రాణం తీసింది. పాలకొల్లు పట్టణంలో సోమవారం జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై జి.పృథ్వీ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బంగారు వారి చెరుగట్టు ప్రాంతానికి చెందిన మాతకాని హరికృష్ణ పదో తరగతి వరకు చదివాడు. పెయింటింగ్ పనిచేసుకుని తల్లిదండ్రులకు ఆసరా ఉంటున్నాడు. స్నేహితులతో కలిసి సోమవారం మధ్యాహ్నం కొత్త కుళాయి చెరువు గట్టు మీద గూటీ బిళ్ల ఆడుకుంటున్నారు. గూటీ బిళ్ల కుళాయి చెరువులో పడిపోయింది. దీంతో హరికృష్ణ దాని కోసం చెరువులోకి దిగి గల్లంతయ్యాడు. తహసీల్దార్ దుర్గాకిషోర్ ఫైర్ సిబ్బందితో కుళాయి చెరువులో వెతికించారు. రాత్రి 7 గంటల సమయంలో మృతదేహం లభించింది. తల్లిదండ్రులు లక్ష్మీ, అప్పన్న కూలి పనిచేసుకుని జీవిస్తున్నారు. వీరికి హరికృష్ణ ఒక్కడే మగ సంతానం. హరికృష్ణ మృతితో వృద్ధాప్యంలో తమకు దిక్కెవరు అంటూ కన్నీరు పెడుతున్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో దూకి సాఫ్ట్‌వేర్ ఇంజనీరు మృతి



నాగ వెంకట సతీష్ (ఫైల్)

యలమంచిలి: బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న యువకుడు చించినాడ వద్ద గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై కర్రీడి గుర్రయ్య కథనం ప్రకారం వీరవాసరం మండలం జొన్నలపాలెంకు చెందిన మెతుకుమెల్లి నాగ వెంకట సతీష్(33) ప్రస్తుతం ఇంటి వద్ద నుంచే పని చేస్తున్నాడు. ఈ నెల 25న బంధువు భీమవరంలో ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ఉండడంతో చూడడానికి వెళ్లాడు. సాయంత్రానికి కూడా ఇంటికి రాకపోవడంతో అతని కోసం గాలిస్తుండగా కుటుంబ సభ్యులకు ఆదివారం సాయంత్రం ఫోన్ వచ్చింది. చించినాడ వద్ద గోదావరి వంతెన మీద బైక్ ఉందని, బైక్ కవర్‌లో ఫోన్ ఉందని చెప్పడంతో కుటుంబ సభ్యులు బైక్ గుర్తుపట్టారు. సతీష్ పెదనాన్న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. గోదావరిలో గాలించగా సోమవారం బాడవ సమీపంలో మృతదేహం లభ్యమైంది. మృతదేహానికి శవపంచనామా, పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై గుర్రయ్య తెలిపారు. మృతుని భార్య ప్రస్తుతం గర్భవతికాగా ముందు ఒక కుమారుడు ఉన్నాడని ఆయన చెప్పారు.

పాముకాటుతో మహిళ మృతి

ముదినేపల్లి రూరల్: పాముకాటుకు మహిళ మృతి చెందిన సంఘటన మండలంలోని ఈడేపల్లిలో సోమవారం జరిగింది. గ్రామానికి చెందిన కె.శివపార్వతి(32) ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో సోమవారం తెల్లవారుజామున పాము కాటేసింది. స్థానికులు సహకారంతో చికిత్స నిమిత్తం గుడివాడ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించింది.

29న మాజీ సైనికులకు అవగాహన సదస్సు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఈ నెల 29న రాజమండ్రి రివర్ బే హోటల్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మాజీ సైనికులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల సైనిక సంక్షేమ అధికారి కేవీ సాయి ప్రసాద్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. స్పర్ష్/పెన్షన్/రికార్డ్ అప్‌డేట్ వంటి సమస్యలపై అవగాహన కలిగిస్తారన్నారు. ఇతర వివరాలకు దగ్గరలోని మాజీ సైనిక సంక్షేమ సంఘ ప్రతినిధులను లేదా జిల్లా సైనిక సంక్షేమ అధికారిని (8688817953) సంప్రదించవచ్చని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి



దెందులూరు- సత్యనారాయణపురం మధ్య జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదం, మృతి చెందిన దోలా జోషి, బోడా చందు

దెందులూరు : జాతీయ రహదారి మరోసారి రక్తసిక్తమైంది. వ్యవసాయ పనులు ముగించుకుని స్వగ్రామానికి వెళ్తున్న వారిని కంటైనర్ రూపంలో విధి బలి తీసుకుంది. దెందులూరు మండలం కొమిరేపల్లి–సత్యనారాయణపురం గ్రామాల మధ్య జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో ఉండి మండలం ఉప్పులూరు గ్రామానికి చెందిన దోలా జోషి (40), బోడా చందు (22) మృతిచెందారు. దెందులూరు ఎస్సై ఆర్.శివాజీ తెలిపిన వివరాలు ప్రకారం.. ఏలూరు నుంచి ట్రాక్టర్‌పై సత్యనారాయణపురం వైపు వస్తుండగా కంటైనర్ వెనుక నుండి ఢీ కొట్టడంతో వ్యవసాయ కూలీలు ఎగిరిపడి అక్కడికక్కడే మృతి చెందారు. కంటైనర్ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. వీరు గుంటూరుకు వ్యవసాయ పనుల కోసం సొంత ట్రాక్టర్‌పై వెళ్లి.. స్వగ్రామానికి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ట్రాక్టర్‌లో ఉన్న మరో వ్యక్తి ఈలి సన్నీకి గాయాలయ్యాయి. మహారాష్ట్రకు చెందిన కంటైనర్ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శివాజీ అన్నారు.

దొంగ స్వామీజీ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కేవీవీఎస్‌వీ ప్రసాద్

నూజివీడు: మీ ఇంట్లో అశుభం జరుగుతుందంటూ భయపెట్టి ప్రముఖ దేవాలయాల్లో శాంతి పూజలు చేయిస్తానంటూ మోసం చేసి డబ్బులు తీసుకొని ఉడాయించే దొంగ స్వామీజీని చాట్రాయి ఎస్సై డీ రామకృష్ణ అరెస్టు చేశారు. అతని నుంచి రూ.80 వేల నగదు, మోటర్ సైకిల్ రికవరీ చేశారు. నూజివీడు డీఎస్పీ కేవీవీఎస్‌వీ ప్రసాద్ సోమవారం సీఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం పెరయాగూడెంకు చెందిన తూరపాటి బాలయ్య(37) స్వామీజీ వేషాలు వేసి మోసం చేస్తున్నాడు. గత నెల 16న చాట్రాయి మండలం ఆరుగొలనుపేటలో ఒక ఇంటికి వెళ్లి మీపై ఎవరో చేతబడులు చేస్తున్నారని, అందువల్లే మీ అల్లుడు చనిపోయాడని, మీ కుమారుడికి వాహన గండం ఉందని చెప్పారు. విజయవాడలోని కనకదుర్గ గుడిలో పూజలు చేయాలని, రూ.61 వేలు అవుతుందని చెప్పి ఆ డబ్బులు తీసుకొని సంక్రాంతికి పూజా సామగ్రి పంపుతానని చెప్పి నగదు తీసుకొని వెళ్లిపోయాడు. అతను రాకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై చాట్రాయి ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ నెల 26న చాట్రాయి ఊరి చివరన వాహనాలు తనిఖీ చేస్తుండగా దొంగ స్వామీజీ పారిపోవడానికి ప్రయత్నించగా అదుపులోకి తీసుకొని విచారించారు. 8 నెలల క్రితం నూజివీడు మండలం పోతురెడ్డిపల్లిలో ఒక ఇంటికి వెళ్లి శాంతి పూజలు చేయాలని చెప్పి రూ.26,400 తీసుకొని ఉడాయించాడు. అశ్వరావుపేట, చింతలపూడి, సత్తుపల్లి ప్రాంతాల్లో కూడా ఇలాంటి మోసాలకు పాల్పడ్డాడు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ అప్రమత్తంగా ఉండాలని, స్వామీజీ వేషాలు వేసుకొని వస్తే వారి మాయమాటలు విని మోసపోకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల సత్వర పరిష్కారం



శిక్షణా కార్యక్రమం ప్రారంభంలో మాట్లాడుతున్న జడ్జి ఎం.సునీల్ కుమార్

ఏలూరు (టూటౌన్): కేసులు త్వరితగతిన పరిష్కరించడానికి మధ్యవర్తిత్వం ఉపయోగపడుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి(ఎఫ్.ఎ.సి) ఎం.సునీల్ కుమార్ అన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని రిటైర్డ్ న్యాయమూర్తులు, ఎంపిక చేసిన న్యాయవాదులు, సోషల్ వర్కర్లకు 5 రోజుల శిక్షణా తరగతులను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ప్రతిపాదించిన రిసోర్స్ పర్సన్లతో న్యాయవాదులకు శిక్షణ తరగతుల నిర్వహిస్తున్నారని తెలిపారు. రాజీకి అవకాశమున్న కేసుల్లో కక్షిదారులకు శాస్త్రీయంగా కౌన్సెలింగ్ నిర్వహించడం వల్ల కేసులు త్వరితగతిన పరిష్కరించవచ్చని చెప్పారు. రాష్ట్రంలో మొదటిగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాను ఎన్నుకున్నారని, న్యాయవాదులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెండో అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి, ఐదో అదనపు జిల్లా జడ్జి జి.రాజేశ్వరి, పోక్సో స్పెషల్ కోర్ట్ జడ్జి ఎస్.ఉమా సునంద, పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, ఏలూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కోనే సీతారాం తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం



భీమవరం యూత్ క్లబ్‌లో టెన్నిస్ ప్లేయర్ రత్నాకర్‌రావును సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: పిల్లల్లో టెన్నిస్ పట్ల ఆసక్తి పెంపొందించాలనే లక్ష్యంతో భీమవరం యూత్‌కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆలిండియా టెన్నిస్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు యూత్‌క్లబ్ అధ్యక్షుడు, ఉండి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. సోమవారం యూత్ క్లబ్‌లో కనుమూరు సూర్యనారాయణరాజు మెమోరియల్ జాతీయస్థాయి అండర్–16 బాల, బాలిక టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం సందర్భంగా సభలో ఆయన మాట్లాడారు. క్లబ్ గౌరవాధ్యక్షుడు గోకరాజు వెంకట నర్సింహరాజు మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని, వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 70 మంది క్రీడాకారులు పాల్గొనడం అభినందనీయమన్నారు. క్లబ్ ఉపాధ్యక్షుడు పేరిచర్ల వెంకటశ్రీనివాసరాజు(సుభాష్) మాట్లాడుతూ యూత్ క్లబ్‌లో దాతల సహకారంతో క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం సీనియర్ ప్లేయర్, కోచ్ ఎ.రత్నాకర్‌రావును ఘనంగా సత్కరించారు. పీవీఎల్ నర్సింహరాజు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు ఎంవీఎస్ సీతారామరాజు, కార్యదర్శులు మంతెన సత్యనారాయణరాజు, కేవీ సత్యనారాయణరాజు(సత్తులు), జాయింట్ సెక్రటరీ వేగేశ్న రామకృష్ణంరాజు, కోశాధికారి కె.సత్యనారాయణరాజు, కనుమూరు రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నరసాపురం రూరల్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన నరసాపురం మండలం కొప్పర్రులో చోటుచేసుకుంది. మృతదేహం కాళ్లు రెండు తాళ్లతో కట్టేసి ఉండటం, పొట్టపై పొడిచిన గాయం ఉండటంతో పలు అనుమానాలకు తావిస్తుంది. రూరల్ పోలీస్ స్టేషన్ రైటర్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట శివారు ప్రాంతంలో సోమవారం గుర్తు తెలియని మగ మృతదేహం కనిపించడంతో వీఆర్వో వినోద్ పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉందని, మృతుడి వయస్సు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందన్నారు. సుమారు 10 రోజులకు పైగా నీటిలో ఉండటంతో పూర్తిగా కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి మృతదేహం కొట్టుకు వచ్చిఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ స్టేషన్ ఎదుట షాపులో దోపిడీ

ఆకివీడు: దొంగల ఒకే రోజు ఐదు షాపుల్లో దొంగతనాలకు పాల్పడిన సంఘటన ఆకివీడులో జరిగింది. స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుటే ఉన్న బ్రాందీ షాపులో దర్జాగా దొంగతనానికి పాల్పడ్డారు. బైపాస్ రోడ్డులోని మరో బ్రాందీ షాపులో చోరీ చేశారు. ఆదివారం తెల్లవారుజామున ఈ వరుస దొంగతనాలు జరిగాయి. మద్యం షాపు తెరిచాక దొంగతనం జరిగిందని షాపు యజమానులకు తెలిసింది. సిద్ధాపురం రోడ్డులోని ఫోటో స్టూడియో, మెడికల్ షాపు, కిరాణా కొట్టులో దొంగతనానికి పాల్పడ్డారు. గునపం, రాడ్డుతో తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించి ఫోటో స్టూడియోలో హార్డు డిస్క్, కెమెరా, గల్లా పెట్టెలోని కొంత నగదు దోచుకుపోయారని స్టూడియో యజమాని ఫిర్యాదు చేశారు.

అంబేద్కర్ వారసుల మీద కుట్ర



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): దేశంలో అంబేద్కర్ వారసుల మీద కుట్ర జరుగుతోందని, మాలలు గత కొన్ని సంవత్సరాలుగా దళితుల హక్కుల కోసం పోరాటం చేస్తుంటే, మందకృష్ణ మాదిగ బీజేపీ ప్రభుత్వానికి సపోర్ట్ చేస్తూ అంబేద్కర్ వారసులను నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. మాల సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి సోమవారం పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మంగరాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ మందకృష్ణను అడ్డుపెట్టుకొని, బీజేపీ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు తీసేయటానికి కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. దళితుల మధ్య విభేదాలు సృష్టించి లబ్ధి పొందాలని చూస్తున్న బీజేపీ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో దళితులు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్ర నాయకులు మానుకొండ నాగేశ్వరరావు, డి.రమణ, ఎస్.రాజు, టి.ప్రేమ్‌కుమార్, గోపి, తదితరులు పాల్గొన్నారు.

అత్యాచార యత్నం కేసులో మూడేళ్ల జైలు

ఆగిరిపల్లి: బాలికపై అత్యాచారయత్నం కేసులో నిందితుడికి మూడేళ్లు జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ మచిలీపట్నం పోక్సో కోర్టు న్యాయమూర్తి సోమవారం తీర్పు వెలువరించారు. ఎస్సై శుభ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆగిరిపల్లి మండలం కృష్ణవరానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన యాదల కిషోర్ అత్యాచార యత్నం చేసేందుకు ప్రయత్నించగా.. బాలిక కేకలు వేసింది. చుట్టుపక్కల వారు, తల్లిదండ్రులు రావడంతో నిందితుడు పారిపోయాడు. 2020 ఆగస్టు 10న ఈ ఘటనపై ఆగిరిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి జైలు శిక్ష, జరిమానా విధించారు. బాధితురాలికి రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశాలు ఇచ్చారు.

క్లుప్తంగా

పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి



పెదతాడేపల్లిలో ఇఫ్టూ ఆధ్వర్యంలో రైతుల నిరసన కార్యక్రమం

తాడేపల్లిగూడెం రూరల్: రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని ఇఫ్టూ జిల్లా సహాయ కార్యదర్శి మామిడి దానవరప్రసాద్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్‌కేఎం పిలుపులో భాగంగా సోమవారం మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దానవరప్రసాద్ మాట్లాడుతూ గత 57 రోజుల నుంచి రైతు జగ్జిత్ సింగ్ నిరాహార దీక్ష చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వహించడం సరికాదన్నారు. గతంలో రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో చేసిన ఉద్యమం ప్రపంచ చిత్రపటంలో దిక్సూచిగా నిలుస్తుందన్నారు. నల్లచట్టాలను ప్రభుత్వం అమలు చేయాలని చూస్తే సమరశీల పోరాటాలకు కార్మిక, ఉద్యోగ వర్గాలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గోవింద్, తాతారావు, చందక శ్రీను, వెంకట సూర్య నాగేశ్వరరావు, ఆదినారాయణ, చప్ప శ్రీను, వెంకట నాగేశ్వరరావు, తాతాలు, బాబ్జీ, అప్పలకొండ తదితరులు పాల్గొన్నారు.

లూథరన్ చర్చి డెలిగేట్ల ఎన్నిక



నూతనంగా ఎన్నికైన లూథరన్ చర్చి డెలిగేట్లను అభినందిస్తున్న సంఘాల సభ్యులు

పెంటపాడు: పెంటపాడు ప్యారిష్ లూథరన్ చర్చి డెలిగేట్ల ఎన్నికలు ఘనంగా ముగిసాయి. ఈ సందర్భంగా 4 సంవత్సరాల కాలపరిమితికి సంబంధించి డెలిగేట్‌గా జి. శేఖర్‌బాబు, ఆల్టర్నేట్ డెలిగేట్‌గా వై. సునీల్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులను ప్యారిష్ పాస్టర్ రెవరెండ్ పి. సునీల్‌కుమార్, పీసీసీ, ఎల్‌సీసీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.

ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఇరగవరం: ప్రజా సమస్యలు పరిష్కారం కోసం ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నామని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు సోమవారం మండల స్థాయిలో నిర్వహించారు. రేలంగి గ్రామానికి చెందిన బొడ్డు సుబ్రహ్మణ్యం నుంచి అర్జీ స్వీకరించారు. రేలంగి గ్రామం మసీద్ వీధి 5, 6 వార్డుల్లో గత 30సంవత్సరాలుగా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నామని, తక్షణమే డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

సొమ్ములు లాక్కున్న నేరంపై కేసు నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: మద్యం సేవిస్తున్న వారిని బెదిరించి సొమ్ములు లాక్కున్న ఘటనపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్సై జేవీఎన్. ప్రసాద్ తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కుంచనపల్లి గ్రామానికి చెందిన సుంకర నాగేంద్ర ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతను ఈ నెల 26వ తేది రాత్రి 8 గంటల ప్రాంతంలో కుంచనపల్లి శివారు పొలంలోకి వెళ్లాడు. అక్కడ మద్యం సేవిస్తున్న వారిని గణపవరం మండలం జల్లి కొమ్మర గ్రామానికి చెందిన కోడేటి సీతారాముడు అనే వ్యక్తి పోలీసులకు చెబుతానని బెదిరించి సొమ్ములు లాక్కున్నాడు. అయితే సీతారాముడు గురించి విచారించగా, అక్కడకు వచ్చే వారిని బెదిరించి సొమ్ములు తీసుకుంటున్నట్లుగా నాగేంద్ర రూరల్ పోలీసులకు సోమవారం రాత్రి ఫిర్యాదు చేశారు. దీనిపై రూరల్ ఎస్సై జేవీఎన్.ప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

పెంటపాడు: గ్రామంలో ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించి, ఆరోగ్యంగా జీవించాలని ప్రత్తిపాడు గ్రామ కార్యదర్శి పి.నాగేశ్వరరావు పేర్కొన్నారు. గత రెండు రోజులుగా గ్రామంలో ఆయన దోమల మందు పిచికారి చేయించి గ్రామంలో అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కాగులంపాడు, బీసీ ఏరియా, ఎస్సీ ఏరియా, ఆరుగొలను రోడ్డు ప్రాంతంలో ప్రజలతో మాట్లాడారు. చెత్తను డబ్బాల ద్వారా ట్రాక్టర్‌కు అందజేసి, డ్రెయినేజీల్లో మురుగు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ సిబ్బంది శ్రీనివాస్, అంజిబాబు, మంగరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

పుంతరోడ్లకు మోక్షమెప్పుడో?

- ఏళ్ల తరబడి నిర్మాణానికి నోచుకోని రహదారులు
- పండించిన పంట గట్టుకు చేర్చేందుకు తంటాలు
- ఆశగా ఎదురు చూస్తున్న రైతులు

తాడేపల్లిగూడెం రూరల్: రైతాంగం పండించిన పంట గట్టుకు తెచ్చుకునేందుకు రహదారి మార్గాలు లేక నానా అవస్థలు పడుతున్నారు. దీంతో రైతాంగానికి ప్రతీ ఏటా వర్షాకాలంలో ఇక్కట్లు తప్పడం లేదు. తాడేపల్లిగూడెం మండలంలో దాదాపు 40 వరకు పుంత రోడ్లు ఉన్నాయి. ప్రధానంగా మోదుగగుంట- మాధవరం, లింగారాయుడిగూడెం - ఆరుగొలను, జగన్నాథపురం- ఆరుగొలను, పట్టింపాలెం - ఎర్ర కాలువ, అప్పారావుపేట తదితర గ్రామాల్లో పుంత రోడ్లు నిర్మించవలసి ఉంది. రైతులకు ప్రధాన రవాణా పుంత రోడ్లు. చేలలో పండించిన పంటను ట్రాక్టర్లు, ఎడ్ల బండ్ల ద్వారా గ్రామంలోకి తెచ్చుకుని విక్రయిస్తుంటారు. అలాగే చేలకు ఎరువులు, మకాంల వద్ద ఉన్న పాడి పశువులకు గడ్డి వంటివి తెచ్చుకోవడానికి ఈ



జగన్నాథపురం బాడవాలోని చేలకు వెళ్లే పుంత రోడ్డు (ఫైల్)



మోదుగ గుంట - మాధవరం పుంత రోడ్డు ప్రస్తుత పరిస్థితి

పుంత రోడ్లు అవసరం. కాంగ్రెస్ పార్టీ హయాంలో పుంత రోడ్ల నిర్మాణం జరిగింది. నాటి నుంచి నేటికీ పుంత రోడ్ల ఊసే లేకుండా పోయింది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పుంత రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసినప్పటికీ అవి ముందుకు కదలలేదు. దీంతో పుంత రోడ్ల సమస్య రైతాంగానికి చింతగానే మారింది. ఈ రోడ్లు నిర్మిస్తే వర్షాకాలంలో రైతాంగానికి ఎంతో వెసులుబాటుగా ఉంటుంది.

పుంత రోడ్లను నిర్మించాలి



చేల వద్దకు ఎరువులు, పశుగ్రాసం, పండించిన పంట తెచ్చుకునేందుకు పుంత రోడ్లు సరిగా లేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షాకాలంలో పుంత రోడ్లు బురదగా మారి వాహనాలు వెళ్తుంటే దిగబడిపోయే పరిస్థితి. దీంతో వాహనాలు మరమ్మతులకు వస్తున్నాయి. శాశ్వత ప్రాతిపదికన పుంత రోడ్లను నిర్మించాలి.

– ఏపూరి వెంకటేష్, రైతు, మోదుగ గుంట, తాడేపల్లిగూడెం మండలం

ఆర్టీసీ డిపో మేనేజరుకు సత్కారం



తణుకు డిపోలో మేనేజరు గిరిధర్‌కుమార్‌ను సత్కరించిన నేషనల్ మజ్దూర్ యూనిటీ నాయకులు

తణుకు అర్బన్: కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల్లో భాగంగా రాష్ట్రంలో తణుకు డిపో మొదటి స్థానంలో నిలిచిన సందర్భంగా తణుకు డిపో నేషనల్ మజ్దూర్ యూనిటీ ఆధ్వర్యంలో సోమవారం డిపో మేనేజరు సప్పా గిరిధర్‌కుమార్, కార్గో డీఎంఈ షేక్ లాల్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా మేనేజరు గిరిధర్‌కుమార్ మాట్లాడుతూ కార్గో సేవల్లో తణుకు డిపో మొదటి స్థానంలో నిలవడంలో వినియోగదారుల పాత్రతోపాటు ఆర్టీసీ డిపోలోని ఉద్యోగులు, కార్మికుల కృషి కూడా ఉందని స్పష్టం చేశారు. సూపరింటెండెంట్ రమణ మూర్తి, చార్ట్ బుకింగ్ ఏడీసీ రామకృష్ణ, జోనల్ ప్రచార కార్యదర్శి వై.వెంకటరావు, ఎన్ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు ఎంవీ రత్నం, డిపో అధ్యక్షుడు సరిదే ఏసుబాబు, డిపో కార్యదర్శి బీవీఎన్ సుబ్బారావు, గ్యారేజ్ ఇన్‌చార్జ్ గూడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా నేషనల్ ఎలక్ట్రీషియన్స్ డే



తణుకుఅర్బన్: పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎలక్ట్రీషియన్ సంఘ నాయకులు



అత్తిలి: సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

తణుకు అర్బన్: ఎలక్ట్రీషియన్స్ వృత్తిలో సీనియర్స్‌తో పాటు యువత ఉపాధి పొందుతూ తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేతా విజయకుమార్, బళ్ల నాని అన్నారు. తణుకు పట్టణ ఎలక్ట్రీషియన్స్ లైసెన్స్‌డ్ కాంట్రాక్టర్స్ అండ్ అప్రెంటీసెస్ (వర్కర్స్) వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎలక్ట్రీషియన్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలక్ట్రీషియన్ వృత్తిపరంగా అందరికీ వెలుగులు అందజేస్తున్నా ఎలక్ట్రీషియన్స్ మాత్రం ప్రభుత్వాలు చీకట్లే మిగులుస్తున్నాయని విమర్శించారు. ఒకరిపై ఆధారపడకుండా యువత ఎలక్ట్రీషన్ వృత్తిలో ఉపాధి పొందుతున్నారని వారికి ప్రభుత్వం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా జనవరి 27వ తేదీని అన్ని రాష్ట్రాల్లోను ఎలక్ట్రీషియన్స్ డేగా నిర్వహించుకుంటున్నామని ప్రభుత్వం కూడా అధికారికంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ప్రమాదాల్లో గాయపడుతున్న వారికి కార్మిక శాఖ నుంచి ఎటువంటి లబ్ధి చేకూరడం లేదన్నారు. ముందుగా తణుకు భవన నిర్మాణ కార్మిక సంఘ భవనంలో సమావేశం నిర్వహించిన అనంతరం పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ముదిగిన సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఉన్నమట్ల రామారావు, డి.శ్రీనివాస్‌రెడ్డి, సహాయ కార్యదర్శి కె.పోతురాజు, కోశాధికారి ఉన్నమట్ల జాన్, సభ్యులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ పనివారకు భద్రత కల్పించాలి

అత్తిలి: మండలంలోని ఎలక్ట్రీషియన్స్ డే కార్యక్రమాన్ని మండల ప్రైవేటు ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సంఘ భవనంలో నిర్వహించారు. బల్బును కనుగొన్న థామస్ ఆల్వా ఎడిషన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ జెండాను ఆవిష్కరించారు. ముందుగా అత్తిలి గ్రామంలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్స్ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సంఘ భవనంలో జరిగిన కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కొరిపల్లి హరి మాట్లాడుతూ సంఘ సభ్యులంతా ఐకమత్యంగా ఉంటూ సంఘాభివృద్ధికి దోహదపడాలని కోరారు. కార్యక్రమంలో ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బడేటి సర్వేశ్వరరావు, సెక్రటరీ వీటీ శివశంకర్ ప్రసాద్, గౌరవ అధ్యక్షులుడు కొరిపల్లి హరి, సైపు సూర్యచంద్రరావు, వానపల్లి సుబ్బారావు, రంభ నాగ సత్యనారాయణ, కోసూరి అప్పలస్వామి, గుండేపల్లి మురళీకృష్ణ, కడలి రాంబాబు, కర్రి శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రాఘవరెడ్డి సేవలు మరువలేనివి



రాఘవరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వడ్డి రఘురాం

పెంటపాడు: రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి ఉపాధ్యక్షుడిగా, సర్ ఆర్థర్‌కాటన్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడిగా నల్లమిల్లి వీరరాఘవరెడ్డి సేవలు మరువలేనివని వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు వడ్డి రఘురాం పేర్కొన్నారు. సోమవారం పెంటపాడులోని రాఘవరెడ్డి సంతాప సమావేశంలో పలువురు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ రాఘవరెడ్డి మృతి మృతి తీరని లోటన్నారు. భీమవరానికి చెందిన రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు కలిదిండి గోపాలకృష్ణంరాజు, అధ్యక్ష, కార్యదర్శులు పాతపాటి మురళీరామరాజు, తమ్మినీడి నాగేశ్వరరావు, మంతెన రామకృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు వల్లూరి బ్రహ్మానందం, మార్లపూడి సుబ్బారావు, దేవరశెట్టి రాంబాబు, పాలా గణపతి, సాగునీటి సంఘ అధ్యక్షుడు పసల పెదకాపు, గూడెం ఏఎంసీ మాజీ అధ్యక్షుడు పాతూరి రాంప్రసాద్ చౌదరి, మాజీ ఉపాధ్యక్షుడు జామి కృష్ణ, మాజీ డైరెక్టర్ నల్లమిల్లి గాంధీరెడ్డి, ఏపీ వ్యవసాయ కార్మికసంఘ జిల్లా కార్యదర్శి కళింగ లక్ష్మణరావు, సీపీఎం నాయకులు చిర్ల పుల్లారెడ్డి, విశ్రాంత ఇంజనీర్ యాండ్రపు సూర్యప్రకాష్, వ్యవసాయశాఖ ఏడీఏ పి. మురళీకృష్ణ ఏవో పార్థసారధి, గూడెం ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు శేషులత, ముత్యాల ఆంజనేయులు, వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మండల మాజీ చైర్మన్ పసల అచ్యుతం, పెంటపాడు, ముదునూరుపాడు రెడ్డి సంఘ నాయకులతో పాటు, మండల వైఎస్సార్ సీపీ నాయకులు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొని రాఘవరెడ్డి చిత్రపటానికి నివాళులర్పించారు.

ఆరోగ్య నియమాలు తప్పక పాటించాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆరోగ్య నియమాలు తప్పక పాటించాలని, ప్రజలందరూ పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండాలని సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు పేర్కొన్నారు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు వీకర్స్‌కాలనీ, యాగర్లపల్లి, బేబి సెంటర్ పరిధిలోని 2, 14, 15, 16 వార్డుల్లో జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాలపై సోమవారం సబ్ యూనిట్ అధికారి పర్యవేక్షణలో ప్రజలకు, సిబ్బందికి అవగాహన సదస్సులు నిర్వహించారు. పట్టణంలో ర్యాలీలు జరిగాయి. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ఆరోగ్య నియమాలు పాటించడం, పరిసరాలలో పొడి వాతావరణ ఉంచేందుకు, పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. వారానికి ఒక్కసారి ప్రతి శుక్రవారం డ్రై డే పాటించడం ద్వారా దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టవచ్చునని తెలిపారు.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన వెక్టార్ కంట్రోల్, డ్రైడే కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శులు జ్యోతి, ప్రశాంతి, అంబిక, చంద్ర, ఆశాలు, ఆరోగ్య సహాయకులు, ఏలూరి కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న పశువైద్య శిబిరాలను వినియోగించుకోవాలని నవాబుపాలెం గ్రామ సర్పంచ్ మద్దుకూరి గంగాభవాని అన్నారు. సోమవారం మండలంలోని నవాబుపాలెం, కొమ్ముగూడెం గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గంగా భవాని మాట్లాడారు. నందమూరు పశువైద్యాధికారి డాక్టర్ వి.సునీల్ కుమార్ మాట్లాడుతూ పశువులకు సకాలంలో నట్టల నివారణ మందు, టీకాలు వేయించాలన్నారు. పశువుల పెంపకం గురించి వివరించారు. అనంతరం నవాబుపాలెంలో 96, కొమ్ముగూడెంలో 32 పశువులకు, 200 గొర్రెలు, మేకలను పరీక్షించి నట్టల నివారణ టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.డి.అహ్మద్, పశువైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్, సిబ్బంది వెంకటేష్, సువర్ణరాజు, ప్రకాష్, పోసుబాబు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కె సముద్రపుగట్టులో పశువులకు టీకాలు



తాడేపల్లిగూడెం రూరల్: కొమ్ముగూడెంలో పశువులకు నట్టల నివారణ టీకాలు వేస్తున్న దృశ్యం



అత్తిలి: కె సముద్రపుగట్టులో పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

అత్తిలి: మండలంలోని కె సముద్రపుగట్టు గ్రామంలో పశువులకు నట్టల నివారణ, గొంతువాపు, కొక్కెర వ్యాధులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని జంతు సంక్షేమ సంఘం డైరెక్టర్ ఆల్తి అజయ్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ప్రభుత్వం కల్పించిన ఈఅవకాశాన్ని పశువుల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె నర్సింహమూర్తి, సర్పంచ్ బండి వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు మెంతు రాజ్‌కుమార్, చిట్టాల పార్వతి, కవురు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీలో వర్క్‌షాప్

తాడేపల్లిగూడెం: వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్సు అండ్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఎంపవరింగ్ ది నెక్స్ట్ జనరేషన్ ఆఫ్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్ విత్ డీప్ లెర్నింగ్ అండ్ క్లౌడ్ కంప్యూటింగ్ అనే అంశంపై వర్క్‌షాప్‌ను సోమవారం నిర్వహించారు. వివిధ కళాశాలల నుంచి 114 మంది అధ్యాపకులు హాజరయ్యారు. పరిశోధనలు చేస్తున్న రీసెర్చ్ స్కాలర్స్ ,పీజీ విద్యార్థులు వర్చువల్‌గా సాగిన వర్క్‌షాప్‌ను నిర్వహించారు. దేశ విదేశాల్లో ప్రముఖ విద్యాసంస్థల్లో పనిచేస్తున్న ప్రొఫెసర్లు రీసోర్సుపర్సన్స్‌గా వ్యవహరించారు. డీప్‌లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు ద్వారా భవిష్యత్ తరాలను ఆర్థికంగా బలోపేతం చేయడం గురించి ప్రొఫెసర్లు వివరించారు. ఆస్ట్రేలియాలోని కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల ప్రొపెసర్ డాక్టర్ శ్రీనివాసులు పలు విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ రత్నాకర్, కో ఆర్డినేటర్ దావీదు రాజు లు పాల్గొన్నారు.

స్పందనకు మంగళమేనా !

ఇరగవరం: సచివాలయాల పరిధిలో పరిపాలనా సౌలభ్యంలో భాగంగా నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రతిరోజూ స్పందన కార్యక్రమానికి ప్రస్తుత కూటమి ప్రభుత్వం మంగళం పాడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామ సచివాలయాల్లో ఎక్కడా దాని ఆనవాళ్లు కనిపించకపోవడమే ఇందుకు నిదర్శనమంటున్నారు. నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అధికారులంతా ప్రజలకు జవాబుదారీగా ఉండాలంటూ, ప్రతి రోజూ స్పందన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎవరిపైనైనా ఫిర్యాదు చేసేందుకు ఆయా గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో ప్రతి రోజూ సాయంత్రం మూడు నుంచి నాలుగు గంటల వరకు పంచాయతీ కార్యదర్శితో పాటు, సచివాలయంలోని అధికారులందరూ ఈ స్పందనకు హాజరయ్యేవారు. గ్రామంలో ఏవిధమైన సమస్య ఉన్నా స్థానికంగా ప్రతిరోజూ గంట పాటు నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజలు ఫిర్యాదు చేసి, సమస్యలను వెంటనే పరిష్కరించుకునేవారు. దీని వల్ల గ్రామంలోనే స్పందన కార్యక్రమం ఏర్పాటు చేయడంతో ప్రజలకు దూరాభారం, ఆర్థిక ఇబ్బందులు, సమయం వృథా కాకుండా ఇంటికి సమీపంలోనే స్పందన జరగడంతో ప్రజలకు మరింత అనుకూలంగా ఉండేది. జీవనోపాధి కోసం వివిధ పనులకు వెళ్లే గ్రామీణ ప్రజలను దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో మండల స్థాయిలో నిర్వహించే స్పందనకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం ప్రజలకు మళ్లీ కష్టాలు తీసుకువచ్చింది. గ్రామస్థాయిలో ప్రతిరోజూ గంట పాటు జరిగే స్పందన కార్యక్రమంపై చిన్నచూపు చూడటంతో ప్రజలు మండల స్థాయి స్పందనకు వెళ్లాల్సిన పరిస్థితి తలెత్తింది. దీనిపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. గత ప్రభుత్వం మాదిరిగానే గ్రామ స్థాయిలోనే స్పందన కార్యక్రమాన్ని పునరుద్ధరిస్తే వృద్ధులు, మహిళలకు ఎంతో మేలు జరుగుతుందని అంటున్నారు. ఆయా గ్రామాల నుంచి ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే ఎన్నో వ్యయప్రయాసలు పడాల్సి వస్తుంది. తణుకు నియోజవర్గంలో 87 సచివాలయాలు ఏర్పాటు చేసి గత ప్రభుత్వం ప్రజలకు ఉత్తమ సేవలు అందించింది. ఆయా సచివాలయాల్లో సుమారు 2300మంది ఉద్యోగులు సేవలందిస్తున్నారు.



వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన కౌంటర్లు(ఫైల్)

నియోజకవర్గంలోని సచివాలయాలు

తణుకు మండలం	44 సచివాలయాలు
ఇరగవరం మండలం	21 సచివాలయాలు
అత్తిలి మండలం	20 సచివాలయాలు

పేరుకుపోతున్న సమస్యలు

ఆయా గ్రామాల్లోని సమస్యలను అధికారులకు విన్నవించేందుకు మండల కేంద్రానికి రావాల్సి ఉండటంతో చాలా మంది ప్రజలు బాధితులు ఇబ్బందులు పడి, సమస్యలను చెప్పలేకపోతున్నారు. దీంతో ఆయా గ్రామాల్లోని సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోతున్నాయి. ప్రస్తుతం మండల హెడ్ క్వార్టర్‌లోనే స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

గ్రామ స్థాయి స్పందన కొనసాగించాలి



ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకొని వెంటనే గ్రామ స్థాయిలో స్పందన కార్యక్రమాన్ని కొనసాగించాలి. ఓ మంచి కార్యక్రమాన్ని నీరుగార్చకుండా అధికారులు వెంటనే చర్యలు తీసుకోని గ్రామ స్థాయిలోనే సమస్యలను పరిష్కరించుకునేలా సచివాలయాల్లో గత ప్రభుత్వం మాదిరిగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలి

మంగిన రామానాయుడు, ఎంపీటీసీ, ఇరగవరం.

మహిళలు, వృద్ధులకు చాలా కష్టం



మండలం కేంద్రంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమానికి సుదూర ప్రాంతాల నుంచి రావాలంటే మహిళలు, వృద్ధులకు చాలా ఇబ్బందిగా ఉంటోంది. వారి కష్టాలు చెప్పుకొనేందుకు గత ప్రభుత్వం అద్భుతంగా గ్రామంలోనే స్పందన కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఇప్పుడు కూడా దానిని పూర్తిస్థాయిలో కొనసాగించాలి.

కుడిపూడి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకుడు

సూపర్‌సిక్స్ హామీలను నెరవేర్చాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం హామీలను నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం సీపీఐ, ఏపీ మహిళా సమాఖ్య పట్టణ శాఖల ఆధ్వర్యంలో 31వ వార్డులో ఇళ్ల స్థలాల కోసం అర్హులైన వారికి దరఖాస్తులు రాసి ఇచ్చారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ పేదల సొంత గృహాలు లేకపోవడంతో అద్దె ఇళ్లకు నెలకు 5 వేలు, 6 వేలు చెల్లించలేని పరిస్థితుల్లో పేదలు తీవ్ర అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు సీతారాం ప్రసాద్, పట్టణ కార్యదర్శి మండల నాగేశ్వరరావు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

అత్తిలి: మండలంలో స్కోజో ఫౌండేషన్ ద్వారా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ పేదలను ఆదుకోవడం హర్షణీయమని టీడీపీ మండలాధ్యక్షుడు ఆనాల ఆదినారాయణరావు అన్నారు. సోమవారం అత్తిలి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద స్కోజో ఫౌండేషన్ న్యూఢిల్లీ వారు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సమాజం పట్ల బాధ్యతగా ఫౌండేషన్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం పట్ల వైద్య బృందాన్ని అభినందించారు. ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, గంటా నాగరాజు, పూతినీడి శ్రీనివాస్, ఆల్తి సత్యనారాయణ, కొరిపల్లి హరి, ఆల్తిఅజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు.